ప్రజాశక్తి



ఆదివారం 13, నవంబర్ 2022 5 శ్రీ సత్యసాయి

షూటింగ్‌బాల్ జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. జగరాజు పల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు ఈ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ పాఠశాల నుండి 150 విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు వారిలో ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురులను, 12 మంది బాలికలను ఒక్కొక్క జట్టుగా ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 19వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారని షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు అజీమ్‌బాషా, అశోక్, మధు, చిదానందం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కేటాయింపులు ఘనం..పనులు శూన్యం..



హిందూపురంలోని పరిగి బస్టాండ్ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

రాష్ట్రంలో హిందూపురం పట్టణానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి పోటీ చేసి గెలిచిన వారు రాష్ట్రాన్ని శాశించారు. ప్రస్తుత ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ సైతం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తనయుడు. చంద్రబాబు నాయుడుకు స్వయానా బామ్మర్ది. అయినప్పటికీ హిందూపురం పట్టణంతోపాటు నియోజకవర్గం కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. అభివృద్ధి ఒక్కటే కాదు.. హిందూపురం పట్టణంలో ఇప్పటి వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైతం లేదంటే ఆశ్చర్యకరమైన విషయమే. పాలకుల నిర్లక్ష్యం, అభివృద్ధి కోసం మంజూరైన నిధులను దారి మళ్లించడంతో పట్టణంలో అంతర్గత రహదారులతో పాటు ప్రధాన రోడ్లూ అధ్వానంగా మారాయి.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో అధ్వానంగా అంతర్గత రహదారులు
వెనక్కి మళ్లిన నిధులు..
తిరిగి వస్తేనే అభివృద్ధి పనులు

హిందూపురం పురపాలక సంఘంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, ఆర్అండ్‌బి రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్లన్నీ పెద్ద పెద్ద గోతులు పడి రాకపోకలు సాగించాలంటే నరకం చూడాల్సి వస్తోంది. మున్సిపాల్టీ పరిధిలో శ్రీకంఠాపురం, ముదిరెడ్డిపల్లి, లక్ష్మీపురం, ఇందిరమ్మ కాలనీ, ఆటోనగర్, ఆర్‌టిసి కాలని, చైతన్య నగర్, నానెప్పనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్డు గుంతలమయం అయ్యాయి. ద్విచక్ర వాహనంలో కూడా వెళ్లలేని పరిస్థితి. మున్సిపాల్టీ వారు గుంతలను మట్టితోనైనా పూడ్చలేక పోతున్నారు. ప్రధాన రహదారుల్లో పురపాలక సంఘం వారు అక్కడక్కడా మట్టితో గుంతలు పూడ్చారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. వీటితో పాటు ఉన్న రోడ్లు సైతం భారీ వర్షాలకు గుంతలు పడ్డాయి. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు చేరుతోంది. వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆసుపత్రికి వెళ్లాలంటే ఆటో వారు కూడా తమ ప్రాంతానికి కిరాయికి రావడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధనలక్ష్మి రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఆ రోడ్డు సైతం గుంతలు పడింది. ప్రయివేటు బస్టాండు నుంచి పరిగి రోడ్డుకు వెళ్లే రహదారి కంకరతేలి అధ్వానంగా మారింది. నిత్యం ఈ రహదారి గుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయంలో చిన్న పాటి వర్షం వస్తే ఈ రహదారి గుండా వెళ్లాలంటే నరకప్రాయమే. గత ప్రభుత్వం పట్టణంలో అంతర్గత రోడ్లు, మురుగుకాలువల కోసం రూ.66 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పటి పాలకవర్గం నిధులు వచ్చాయని పనులు ప్రారంభించారు. అయితే ఆ నిధులను దారి మళ్లించడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం..



ధనలక్ష్మి కాలనీలో కంకరతేలిన రోడ్డు

హిందూపురం పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలువవుంటోంది. దోమలు వృద్ధిచెంది రోగాల బారిన పడుతున్నామని అబాద్‌పేట, ముక్కడిపేట ప్రాంతాలకు చెందిన వారు వాపోతున్నారు. రహదారులు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు, అధికారులకు మొరపెట్టుకున్నా నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముక్కడిపేటలో నీటి పారుదల శాఖకు చెందిన కాలువకు మురుగుకాలువను అనుసందానం చేయడంతో చిన్న పాటి వర్షం పడినా ఆ కాలువ ద్వారా మురుగునీరు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లుతోంది.

25 శాతం పనులూ పూర్తి కాలేదు..

హిందూపురం పురపాలక సంఘంలో వైసిపి ఛైర్‌పర్సన్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 38 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.23.59 కోట్లు నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు రూ.4.57 కోట్ల అభివృద్ధి పనులను గుత్తేదారులు పూర్తి చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రాతినిత్యం వహిస్తున్న 19వ వార్డు అభివృద్ధికి రూ.1.69 కోట్లు కేటాయిస్తే.. ఇప్పటి వరకు రూ.9.25 లక్షల పనులు మాత్రమే పూర్తి అయ్యాయి. వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న 14వ వార్డు అభివృద్ధికి రూ.1.01 కోట్లు కేటాయిస్తే, రూ.28.29 లక్షల అభివృద్ధి పనులు పూర్తిచేశారు. ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్‌ల వార్డుల్లోనే ఇలావుంటే కౌన్సిలర్ వార్డుల్లో ఏలావుటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకు 1, 8, 10, 22, 30, 33వ వార్డుల్లో మాత్రమే కాస్త అభివృద్ధి పనులు జరిగాయి.

రహదారుల మరమ్మతుకు చర్యలు..



పట్టణంలో అన్ని అంతర్గత రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. గతంలో మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.66 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పనులు జరగక పోవడంతో ఆ నిధులు వెనక్కి పోయాయి. వెనక్కి పోయిన నిధులు తిరిగి మున్సిపాల్టీకి విడుదల చేయాలని అధికారులకు లేఖ రాయడంతో పాటు సమస్యను వివరించాం. ఆ నిధులు వచ్చిన వెంటనే అన్ని రహదారులతో పాటు డ్రెయినేజీ కాలువలను అభివృద్ధి చేస్తాం. నిధులు పూర్తి స్థాయిలో లేవు. సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్



లక్షుంపల్లి గ్రామంలో పత్తి పంటను మూగజీవాలకు మేతగా వదిలేసిన రైతులు

పత్తి పంట..మూగజీవాలకు మేత..

నాలుగు మాసాలైనా రాని దిగుబడి
ఈ సారీ నష్టాల ఊబిలో రైతులు
ప్రత్యామ్నాయ పంట వైపు దృష్టి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఎన్నో ఆశలు.. ఎంతోకొంత ఆదాయం వస్తుందన్న నమ్మకం.. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా అప్పులు చేసి పత్తి పంటపై పెట్టుబడులు పెట్టిన రైతన్నల ఆశలు అడియాశలుగా మారాయి. విత్తు నాటాక అది మొలకెత్తి ఏపుగా ఎదిగిన పంటను చూసి రైతులు ఎంతో మురిసిపోయారు. అతివృష్టి ప్రభావంతో ఈ పంటలు పచ్చగా ఎదిగాయే తప్ప పత్తి కాయ.. పిందె కూడా కనిపించలేదు. కొంత ఆలస్యంగా అయినా పిందె, పూత లాంటివి వస్తాయేమో అని ఎదురుచూసినా మొగ్గ పూసింది కూడా లేదు.. రైతుల ఆశలు వికసించిందీ లేదు.

పెద్దవడుగూరు మండలం రైతులు పచ్చగా ఉంటున్న పత్తి పంటలను చూసి దిగుబడులు వస్తాయని నాలుగు మాసాలుగా ఎదురుచూశారు. కాపు లేకపోవడంతో దిగుబడులు ఇక రావని నిర్ధారించుకున్నారు. ఎప్పటిలాగే ప్రకృతి తమను మోసం చేసిందని ఆందోళన చెందారు. ఖరీఫ్‌లో వేరుశనగ, పప్పుశెనగ పంటల నష్టంతో పాటు పత్తి పంట కూడా తీవ్ర నష్టానికి గురిచేసిందని తెలుసుకుని రైతులు కలత చెందారు. ఇక చేసేదేమీ లేక పంటలను తొలగించుకుని మూగజీవాలకు మేతగా వదిలిపెడుతున్నారు. పెద్దవడుగూరు మండలంలోని లక్ష్మంపల్లి, దిమ్మగుడి, చిన్నవడుగూరు ఆవులాంపల్లి, కాశేపల్లి, కొట్టాలపల్లితో పాటు పలు గ్రామాల్లో రైతుల దుస్థితి ఇది. ఆరుగాలం కష్టించి పనిచేసినా ఏడాదికి ఎంతో కొంత మూటగట్టుకోవచ్చునని భావించినా సాగుచేసిన పంటలు ప్రకృతి ప్రకోపానికి గురైపోయి తీరని నష్టాలను మిగుల్చుతున్నాయి. మండల వ్యాప్తంగా 35 వేల హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగుచేయగా చాలా గ్రామాల్లో వర్షాలు అధికమై పూత, పిందె రాలిపోవడం.. కాపుదశ లేక దిగుబడులపై ఆశలు సన్నగిల్లాయి. దీనికితోడు గులాబీరంగు పురుగుతో కూడా రైతులు పత్తిపంటను తీవ్రంగా నష్టం పోవాల్సి వచ్చింది.

ఇక ప్రత్యామ్నాయమే శరణ్యం..

ఈ పరిస్థితులలో రైతులు చేసేదేమీలేక పచ్చని పంటలను పశువులకు వదిలివేశారు. వాటిని తొలగించుకుని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారిస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఎల్‌సి కాలువకు సాగునీరు వస్తున్నందున నీటి తడులు అందించి పంటలు పండించుకోవాలనే తపనతో రైతులు ఉన్నారు. ఏది ఏమైనా ఇలా వరుసగా పంటలకు పెట్టుబడులు పెడుతూ నష్టపోతూ బతుకు ఈడ్వడం రైతులకు నానాటికీ కష్టంగా మారుతోంది. రైతు కుటుంబాలు జీవచ్ఛవాలుగా మారుతున్నాయి. నష్టపోయిన పత్తి, మిరప పంటలకు ప్రభుత్వం పరిహారం వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం, రైతు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

మూగజీవాలకు మేతగా వదిలేశాం..
రైతు జయరామిరెడ్డి, లక్షుంపల్లి గ్రామం

మూడు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. ఎకరాకు రూ.30 వేలు చొప్పున రూ.90 వేలు పెట్టుబడి పెట్టాను. పంట అయితే ఏపుగా పచ్చగా పెరిగింది. నాలుగు నెలలవుతున్నా పూత, పిందెలు కూడా రాలేదు. చేసేదేమీ లేక పంటను మూగజీవాలకు మేతగా వదిలేశాం. ప్రత్యామ్నాయ పంట వేసుకోవాలి.



కోర్టు ఆవరణంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. హంద్రీనీవా ద్వారా చిలమత్తూరు మండలంలో అన్ని చెరువులకు నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేస్తు సిపిఎం, సిపిఐతో ఇతర పార్టీల ఆధ్వర్యంలో 2019లో దశల వారి ఆందోళన చేశారు. దీంతో చిలమత్తూరు పోలీసులు సిసి 847/2019 కింద 24 మందిపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేసు కొనసాగింది. బుధవారం పూర్తి స్థాయిలో విచారణ చేసిన న్యాయమూర్తులు శనివారం జరిగిన జాతీయ లోక్ ఆదాలత్‌లో ఇరు వర్గాల వారిని రాజీ చేసి కేసును కొట్టివేశారు. అనంతరం కోర్డు బయట సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతు ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తే పోలీసులు తమపై తప్పుడు కేసులు బనాయించి, అరెస్టులు చేస్తున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడి ప్రజా సమస్యలపై పోరాటాలు ఆపే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, వినోద్, లక్ష్మీనారాయణ, నరసింహులు, వెంకటేష్, రాము, జనసేన నాయకులు రమణ, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పురోగతిలో అలసత్వం తగదు

అనంతపురం డిఐజి రవిప్రకాష్

ప్రజాశక్తి కదిరి టౌన్

కేసుల పురోగతి విషయంలో అలసత్వం వహించొద్దని అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం కదిరి సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో బంగారు నగల వ్యాపారి కరణ్ హత్య కేసును ఆరా తీశారు. త్వరగా కేసును చేధించాలని ఆదేశించారు. కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించి పాత కేసులలో పురోగతిని డిఎస్‌పి భవ్య కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. సబ్ డివిజన్ పరిధిలో నమోదైన గ్రేవ్ , స్పెషల్ గ్రేవ్ , ప్రాపర్టీ అఫెన్సెస్ , రికవరీ శాతం, గ్రేవ్ యూఐపిటి తదితర కేసులను డిఐజి సమీక్షించారు. కదిరి సబ్ డివిజన్ పరిధిలో తరుచూ చోటు చేసుకుంటున్న ఫోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా విద్యా సంస్థలు, ఎస్సీ ఎస్టీ కేసులు అధికంగా ఉన్న గ్రామాల్లో. కింది స్థాయి సిబ్బంది నుండీ డీఎస్పీ స్థాయి అధికారుల వరకు పర్యటించి అవగాహన సదస్సు నిర్వహించాలని ఆదేశించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలపై గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిఐజి రవిప్రకాష్



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె కొనసాగింపు

ప్రజాశక్తి - తాడిమర్రి

తమ సమస్యలు పరిష్కరించేదాకా సమ్మెను కొనసాగిస్తామని సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు తెగేసి చెప్పారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక పంప్ హౌస్ వద్ద 16 రోజులుగా ధర్నా చేస్తున్నారు. శనివారం నిర్వహించిన ఆందోళన లో నాయకులు మాట్లాడుతూ సత్యసాయి బోర్డు సభ్యులు రామారావుకార్మికుల వద్దకు వచ్చి పంపులను రన్ చేయాలని ఒత్తిడి చేశారన్నారు. అయితే కార్మికులకు రావాల్సిన 32 కోట్ల రూపాయల గ్రాడ్యుటీ 572 మందికి చెల్లించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. అలా అని జిల్లా ఉన్నతాధికారులు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఓబులేసు, సుధాకర్, రామకృష్ణ, తిరుపాలు, ఆచారి రవికుమార్, లక్ష్మీరెడ్డి, లక్ష్మీనారాయణ, రమణ, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న టిడిపి నాయకులు

డీఎస్పీ కార్యాలయం ఎదుట టిడిపి ఆందోళన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చట్టవ్యతిరేకంగా టీడీపీ కార్యకర్తలను చితకబాదిన ధర్మవరం టూటౌన్ సీఐ రాజాను వెంటనే సస్పెండ్ చేయాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యకుడు బికె పార్థసారథి డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ధర్మవరం పట్టణంలోని కొత్తపేటలోనిటీడీపీ కార్యకర్తలను లోక్‌అదాలత్లో కేసుల రాజీ పేరుతో సిఐ రాజు స్టేషన్ పిలిపించి చితకబాదారన్న కారణంతో టీడీపీ ఆధ్వర్యంలో శనివారం ధర్మవరంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ముందుగా గాంధీసర్కిల్ నుండి పరిటాల శ్రీరామ్, పార్థసారధి ఇతర నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. కళాజ్యోతి సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం అక్కడినుండి ర్యాలీగా డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. సిఐ వ్యవహరించిన తీరును డీఎస్పీ రమాకాంత్‌కు వివరించి వినతిపత్రం అందజేశారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు చెప్పినట్లు నడుచుకుంటూ టీడీపీ కార్యకర్తలపై కక్షసాధింపులకు పాల్పడుతున్న సిఐ ఖాకీదుస్తులు వదిలేసి వైసీపీ కండువాలతో దుస్తులు కుట్టించుకుని వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పణికుమార్, గొట్లూరు శీన, పురుషోత్తం గౌడ్, సర్పంచి ముత్యాలప్పనాయుడు, భీమనేని ప్రసాద్నాయుడు, పెద్దన్న, పరిసే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణరంగ కార్మికుల ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సాంబశివ

ప్రజాశక్తి - కదిరి టౌన్

సిఐటియు అనుబంధ ఎపి భవన నిర్మాణ రంగ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సాంబశివ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు సిఐటియు 7వ రాష్ట్ర మహాసభలు కృష్ణ జిల్లా గుడివాడలో ఈనెల 10,11 తేదీలోల నిర్వహించారన్నారు. ఈ మహాసభలలో శ్రీసత్యసాయి జిల్లా నుండి బి.సాంబశివను రాష్ట్ర సహాయ కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై రాబోయే రోజుల్లో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు . తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు





నియామక పత్రం అందుకుంటున్న మంజునాథ్

బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులుగా రొద్దం మంజునాథ్

రొద్దం : బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులుగా మండలంలోని బొక్కసాం పల్లి గ్రామానికి చెందిన మూలింటి మంజునాథ్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగిన భక్త కనకదాసు 537వ జయంత్యోత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజ్యసభ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రైజింగ్ రాజశేఖర్ గౌడ్ తో కలిశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా మూలింటి మంజునాథ్ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా మంజు మాట్లాడుతూ జిల్లాకమిటీని బలోపేతంచేసుకుని జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, అనంతపురం జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గాండ్లపెంట : ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి. ఎస్. పరీయా బాను తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల స్మరించుట. 17న రచయితల సందేహాలు. 18న విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన, క్విజ్ పోటీలు, 19న మహిళా సాధికార అవగాహన, 20న డిజిటల్ గ్రంథాలయ పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

రొద్దం : మండలంలోని గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ శాఖ అధికారి నాగరాజు తెలిపారు. 14న బాలల దినోత్సవం,15న పుస్తక ప్రదర్శన,16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకొనుట ఇలా ప్రతి రోజు ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

సమస్యల వెల్లువ

అమరాపురం : మండల పరిధిలోని వి. అగ్రహారం గ్రామంలో ఎంపిపి ఈరన్న అధ్వర్యంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని రంగే గౌడ్, వక్కలిగ సంఘం డైరెక్టర్ ఈరక్యాతప్ప, సింగర్ విండో అధ్యక్షులు బాగాల చిక్కన్న, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ స్వరక్క నరసింహమూర్తి ,ఎంపిటిసి లలితమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఫ్యామిలీ ఫిజీషియన్

మడకశిర రూరల్ : మండల పరిధిలోని గంగలవాయి పాలెం గ్రామంలో శనివారం ఫ్యామిలీ పిజిషియన్‌కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ భార్గవి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వివిధ రకాల ఆపరేషన్ చేసుకున్న రోగులను పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి జ్యోతి, ఎఎన్ఎంలు, ఎంపిహెచ్ఎ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక సచివాలయం వద్ద శనివారం డాక్టర్ జగదీష్ బాబు ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 80కి చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాసులు, అలివేలమ్మ, ఐశ్వర్య, రూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

హిందూపురం : పట్టణంలోని రినాల్డ్ పాఠశాలలో శనివారం ముందోస్తు బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బిబిజాన్, హెచ్ఎం ముస్తఫా ఆలిఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మైనార్టీల ద్రోహి జగన్ : టిడిపి

మడకశిర : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలను ద్రోహం చేసిన మైనార్టీల ద్రోహి సి ఎం జగన్ మోహన్ రెడ్డి అని టిడిపి సత్యసాయి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు భక్తర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లా డారు. వైసిపి తన మూడు సంవ త్సరాల పాలనలో ముస్లిం మైనార్టీలకు అన్ని విధాల ద్రోహం చేసిందన్నారు. అరెస్టు చేసిన రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ మౌలాన ముస్తాక్ అహమ్మద్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికలలో ముస్లిం మైనార్టీలు ఏకమై వైసిపికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హుజుర్‌బాషా, పెనుకొండ మైనార్టీ అధ్యక్షుడు రియాజ్ , పార్లమెంటు కార్యదర్శులు సౌకత్, పార్లమెంటు వైస్ ప్రెసిడెంట్ అత్తర్ ఖాదీర్ , మైనార్టీ నాయకుడు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

కదిరి టౌన్ : సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ వ్యాధులతో బాధపడుతూ వారికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి తన కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. 14 మందికి రూ.8.69 లక్షల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాము, జెడ్పీటీసీలు బాలకృష్ణ నాయుడు, భాస్కర్ రెడ్డి, కొక్కంటి శ్రీనివాసులు నాయుడు, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, సర్పంచి మణికంఠ నాయక్, గజ్జల లోకేశ్వర్ రెడ్డి, బీరప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ధర్మవరం టౌన్ : ప్రధాని నరేంద్రమోడీ పర్యటనకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. శనివారం స్థానిక కళాజ్యోతి సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా ఇతర ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఎపికి ప్రత్యేక హోదా వంటి హామీలను తుంగలో తొక్కి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన నరేంద్రమోడీ ఏమొహం పెట్టుకుని రాష్ట్రంలోకి వస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా, ముసుగు మధు, వెంకటనారాయణ, ఎల్. అదినారాయణ, కొత్తపేట మారుతి, ఎస్ఎఫ్ఐ నాగార్జున, నవీన్, వెంకటస్వామి, రమణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని,ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హోదా కల్పించి విభజన హామీలను మోడీ నెరవేర్చాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నందులో రోడ్డుపై సిపిఎం, సిపిఐ పార్టీ ల ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు హరి, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ కు మోసం చేసిన ఆంధ్రుల ద్రోహి ప్రధాని మోడీ అని పేర్కొన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచారని, ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, కడపకు స్టీల్ ఫ్యాక్టరీ, విశాఖకు రైల్వే జోన్, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు హామీలను అమలు చేయాలని రాజధానికి పోలవరం నిర్మాణం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హుక్కును ప్రైవేటు వ్యక్తులు అంబానీ ఆదానిలకి ధారాధత్వం ఇప్పటికైనా విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ఉద్యమాలకు సిద్ధమవుతామని సందర్భంగా వామపక్ష నాయకులు కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అయూబ్ ఖాన్, సిఐటియు మండల కార్యదర్శి బాబావాలి, వజ్రం నాగప్ప, తిప్పన్న, చిన్న వెంకటేష్, రిక్షా నర్సింలు, సిపిఐ నాయకులు మల్లికార్జున, జాఫర్ వలి, కమలేష్ నాయక్, రమేష్ నాయక్, సిఐటియు నాయకులు ముత్యాలు, శ్రీరాములు, అంజి, తిప్పన్నా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలో శనివారం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇవ్వని ప్రధానమంత్రి గో బ్యాక్ అంటూ లేపాక్షి లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివప్ప, బయన్న, గౌతమ్ కుమార్, నారాయణరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :ఎపికి అన్యాయం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్రంలో పర్యటించే నైతికహక్కు లేదని సిపిఎం పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్టణం పర్యటనను వ్యతిరేకిస్తూ శనివారం సిపిఎంతో పాటు వామపక్ష ప్రజా సంఘాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, కాంగ్రెస్ శ్యామ్‌కిరణ్, బిఎస్‌పి శ్రీరాములు, ఎంఐఎం మున్నా, ఎస్ఎఫ్ఐ బాబావలి, ఎఐఎస్ఎఫ్ చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం నరసింహులు, కెవిపిఎస్ రమణ, ప్రజా సంఘాల నాయకులు కలీం, నూర్ మొహమ్మద్, మధు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో వామపక్షాల నాయకులు గోబ్యాక్ నరేంద్ర మోడీ అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాజగోపాల్. సిపిఐ మండల కార్యదర్శి సుధాకర్. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షులు హనుమయ్య. మండలాధ్యక్షులు వెంకటేష్, ఆవాజ్ మండల కార్యదర్శి చాంద్‌బాషా. అధ్యక్షులు మాబు, వి గంగరాజు, రంగప్ప, బాలస్వామి, కొండా వెంకటేష్, చాంద్‌బాషా, చంద్ర, నాగభూషణం, గంగరాజు, తదితరులు

చిత్రావతి నదిలో పడి యువకుడు మృతి

పుట్టపర్తిఅర్బన్ : చిత్రావతి నదిలో కాలు జారిపడి ఒక యువకుడు మృతి చెందాడు. నగర పంచాయతీ పరిధిలోని కోవెలగుట్టపల్లికి చెందిన నాగభూషణం (34) అనే యువకుడు శుక్రవారం ఉదయం కాలకృత్యాలకు వెళ్లి కనిపించలేదు. ఆయన సోదరులు సమీప పరిసర ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదు. శనివారం ఉదయం చిత్రావతి నది ఒడ్డున నాగభూషణం మృతదేహం కన్పించింది. నాగభూషణం నదిలో కాలుజారి పడి ఉంటాడని ఈత రానందున మృతిచెంది ఉండవచ్చని బంధువులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాబ్జాన్ తెలిపారు.

వంకలో మహిళ మృతదేహం లభ్యం

మడకశిర రూరల్ : మండల పరిధిలోని మణూరుగ్రామ సమీపంలో వంకలో అదే గ్రామానికి చెందిన మహిళ గంగమ్మ (44) మృతదేహం శనివారం సాయంత్రం లభ్యమైందని పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన గంగమ్మ వారం రోజుల నుంచి కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో బంధువుల ఇళ్లలో గాలించారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం వంకలో మృతదేహం లభ్యమైంది. మృతురాలి భర్త సిద్ధ గంగప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

న్యూమోనియాపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : ప్రపంచ న్యూమోనియా దినోత్సవ సందర్భంగా పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడిమామిడి గ్రామంలో గ్రామస్తులకు శనివారం న్యూమోనియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి, ఎంపిపి ఎవి రమణారెడ్డి, డాక్టర్ జ్యోష్ణ, సిహెచ్ఒ నగేష్ పాల్గొని గర్భిణులకు, బాలింతలకు న్యూమోనియా గురించి వివరించారు. అదేవిధంగాఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి పరిశీలించారు. డ్రైడే ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకట రమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, ఆరోగ్య కార్యకర్తలు శివ, మంజుల వాణి, ఎడబ్ల్యుడబ్ల్యు వేదవతి, ఆశా కార్యకర్తలు మమతాజ్, పార్వతమ్మ , నిర్మల ,హసీనా , 104 సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లతో పేదలకు కన్నీళ్లు



గృహ నిర్మాణదారుడితో మాట్లాడుతున్న నాయకులు

ధర్మవరం టౌన్ : జగనన్న ఇళ్ల పేదలకు కన్నీళ్లే మిగిల్చాయని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకంమధుసూదన్‌రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని పోతుకుంట కాలనీ వెనుక నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో ఆయన పార్టీ నాయకులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన లబ్దిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలకం మాట్లాడుతూ ఎన్నికల ముందు పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వడంతో పాటు స్వయం గా ఇళ్లనిర్మాణాలు కూడా నిర్మించి తాళాలు మాత్రమే ఇస్తామని ప్రగల్బాలు పలికిన జగన్ హామీలు ప్రస్తుతం ఏమయ్యాయని ప్రశ్నించారు. బాత్రూంలను తలపిస్తున్న పక్కాగృహాల్లో నివాసం ఎలా ఉంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియచేసి వారికి న్యాయం జరిగేలా పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తిఅర్బన్ : జగనన్న ఇల్లు నిర్మాణాలు పేదలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని పునాదులు గోడలకే పరిమితం అయినాయని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి విమర్శించారు. శనివారం నగర పంచాయతీలోని బ్రాహ్మణపల్లి లో నిర్మిస్తున్న కాలనీని ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి సి వరుణ్, ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, సత్య సాయి జిల్లా కార్యదర్శి అబ్దుల్, పుట్టపర్తి, కొత్తచెరువు, బుగ్గపట్నం, ఒడిసి మండలాల అధ్యక్షులు తలారి పెద్దన్న, పూల శివప్రసాద్, అల్లాడి జయరాం, మేకల ఈశ్వర్, నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, తిరుపతేంద్ర, మారుతి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : జగనన్న గృహాలతో ప్రజలు బేజారు పడుతున్నారని జనసేన పార్టీ ఇన్‌చార్జ్ భైరప్రసాద్ విమర్శించారు. జగనన్న ఇల్లు పేదలందరికీ కన్నీళ్లు నినాదంతో శనివారం కదిరి పట్టణం గట్ల దగ్గర ఉన్న జగనన్న కాలనీని నాయకులు సందర్శించారు. వారు ఏదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కసారి జగనన్న కాలనీలలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటించి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రవీంద్ర, కుటాల లక్ష్మణ్, రెడ్డమ్మ, సాయిప్రియ, ముజీబ్, హరిబాబు, రాజశేఖర్, లోకేష్, నరసింహులు చిన్న తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్నట్లు జగనన్న కాలనీలో ఏ మాత్రం ఇళ్ల నిర్మాణాలు సాగడం లేదని జనసేన జిల్లా కార్యదర్శి రమణ విమర్శించారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని చాగలేరు, కల్లుకుంట వద్ద గల కాలనీలను నాయకులు పరిశీలించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు,అగ్గిశ్రీనివాసులు, అంజినేయులు, లక్ష్మణ మూర్తి, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : జనసేన పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన జగనన్న ఇళ్లు పేదలకంట్లో కన్నీళ్లు అనే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టి సి.వరుణ్‌శీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కుమార్, రాజేష్, మండల అధ్యక్షులు మహేష్, పెనుకొండ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పెనుకొండ సీనియర్ నాయకులు బంగారం, హరి నాయక్, పెనుకొండ పట్టణ యువత నాయకులు మల్లేష్ నాయకులు గంగాధర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పురపాలక సంఘ పరిధిలో టిడ్కో ఇల్లు కేటాయించిన వారందరికి ఇళ్లను అప్పగించాలని జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కొటిపి వద్ద ఉన్న టిడ్కో అపార్ట్‌మెంట్స్ వద్ద ప్లేకార్డులు చూపిస్తు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రవర్తి, కోళ్లకుంట శేఖర్, ప్రభు, హనుమంతు, మనోహర్, లింగరాజు, హరీష్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని తవలం గ్రామంలో జగనన్న కాలనీలో జనసేన పార్టీ నాయకులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెవి.రమణ, అమర్ కార్తికేయ, కొట్టి కుమార్, శ్రీనాథ్, లక్ష్మణ్, కార్యక్రమాల కమిటీ మెంబర్ ఫయాజ్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, అనిల్, ముబారక్, బాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

లోక్అదాలత్‌లో రాజీ కేసులకు పరిష్కారం

పుట్టపర్తి రూరల్ : రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన పుట్టపర్తి లో లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిమినల్, సివిల్ కేసులతో పాటు బ్యాంకు రుణాల కేసులు మొత్తం 89 కేసులకు లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ మాట్లాడుతూ రాజీ కాదగ్గ కేసులకుచక్కటి పరిష్కార వేదికగా లోక్ అదాలత్ ఉందన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా కేసులకు పరిష్కారం చూపుతున్నామన్నారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి రాకేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగమేల్లేశ్వర రెడ్డి, రహమాన్, యదుభూషన్, రాజేంద్రప్రసాద్ రెడ్డి, పూజారి ప్రసాద్, క్రిష్ణమూర్తి, విజయ భారతి రెడ్డి, నాగేంద్ర, మహేష్, అర్బన్ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, రూరల్ సిఐ జయానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కక్షిదారులు రాజీ మార్గాన్ని అనుసరించి కేసుల పరిష్కరించుకోవాలని అనంతపురం ఎస్సీ, ఎస్టీ కోర్డు న్యాయమూర్తి, హిందూపురం లోక్ అదాలత్ న్యాయమూర్తి రాజ్యలక్ష్మి కోరారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా స్థానిక న్యాయమూర్తులు శ్రీధర్, స్పందనతో కలిసి రాజ్యలక్ష్మి రికార్డు స్థాయిలో వివిధ రకాల 770 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పోలీసులు, న్యాయవాదులు కోర్టు సిబ్బంది సహకారంతో ఇంత పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిపి నాగేష్, బార్ అసోసియోషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగప్ప, సుదర్శన్, లోక్ అదాలత్ సభ్యులు సిద్దూ, కృష్ణమూర్తి, పార్వతి, కళావతి, ఫణిభూషణ్, చెన్నప్పతో పాటు లోక్ అదాలత్ సిబ్బంది, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు

కదిరి టౌన్ : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర ఆధ్వర్యంలో మూడు బెంచీలను ఏర్పాటు చేశామని న్యాయమూర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 700 కేసులు పరిష్కారమయ్యాయని చెప్పారు.

ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణమని, ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా నూతన బస్సులను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం నాలుగు నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన ఆర్టీసీ డిపోతోపాటు బస్టాండ్‌లో పర్యటించి సమస్యలను ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, డీఎం మోతిలాల్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ యూనియన్ల నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ ఛైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్ పెనుజూరు నాగరాజు, ఆర్టీసీ యూనియన్ సంఘం గౌరవాధ్యక్షులు డోలా రాజారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సును నడుపుతున్న ఎమ్మెల్యే

ప్రజల నమ్మకాన్ని కోల్పోతున్న పోలీసు వ్యవస్థ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరంలో ప్రజాస్వామ్యం స్థానంలో పోలీసుల రాజ్యాన్ని నిర్మించాలని చూస్తున్నారని, దీంతో వారు ప్రజల్లో నమ్మకాన్నీ కోల్పోయే పరిస్థితులు దాపురించాయని సిపిఐ జిల్లా నాయకులు జింకా చలపతి విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయనతోపాటు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, పట్టణ కార్యదర్శి రవి తదితరులు మాట్లాడారు. రెండు రోజుల క్రితం టీడీపీ కార్యకర్తలను టూటౌన్ సీఐ రాజా చితకబాదడం దారుణమన్నారు పోలీసుల తీరు మారాలని అన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

హిందూపురం : పట్టణంలోనిశ్రీ గుడ్డం రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీమన్నారాయణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకంఠపురం గ్రామస్తులు జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోవింద శర్మ, ఎఒ నాగేంద్రుడు, కౌన్సిలర్ గిరీష్ కుమార్, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ జె.పి.కె.రాము, వైస్ ప్రెసిడెంట్ గౌర శంకర్, సెక్రెటరి యం. మహాదేవ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ఎం.ఎ. కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నల్లచెరువు :స్థానికగీతా మందిరంలో శనివారం కదిరి ఆజాద్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, నరాలులు, దంతాలు, షుగర్, వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆజాద్ హాస్పిటల్ వైద్యులు సిఎస్. ఇస్మాయిల్ ఆజాద్, వివిధ జబ్బులకు సంబంధించిన డాక్టర్లు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

హిందూపురం : పట్టణంలోని అల్ హిలాల్ పాఠశాల ఆవరణంలో ట్రినీటి సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ కుమార్ రాజ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో శనివారం ఉంచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 650 మందికి పరీక్షలు నిర్వహించి, 179 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఇదే సందర్భంగా గత నెల ఆపరేషన్లు చేసిన 175 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి బృందంతో పాటు డాక్టర్ ప్రియ, క్యాంపు ఇన్‌ఛార్జ్ శివప్రకాష్, ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమార్ రాజ్, సెక్రటరీ కె. ఉషారాణి, జామీయ మసీదు ముతవల్లి నూరూల్లా, కమిటీ మెంబర్లు, వాలెంటీర్ అధ్యక్షులు షమీమ్, జాకీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీల్లో జగడాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు సమయం ముంచుకొస్తోంది. పార్టీల్లో జగడాలు పెరుగుతున్నాయి. ముందస్తు రాకపోతే 2024లో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. అంటే మధ్యలో 2023 సంవత్సరం మాత్రమే అడ్డుగా ఉంది. ఇక ఏడాది మాత్రమే ఉండటంతో అప్పుడే పార్టీల్లో హడావుడి మొదలవుతోంది. ముందుగా ఇంట గెలిచేందుకు నేతలు సన్నద్ధమవుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల్లో అంతర్గత పోరు ప్రారంభమవుతోంది. ఉమ్మడి జిల్లాలో రాజకీయ కదలికలు ఊపందుకుంటున్నాయి. ఈ వారంలో అధికార వైసిపిలోనూ, అటు ప్రతిపక్ష టిడిపిలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అనంతపురం జిల్లా అధ్యక్షులుగా ఉన్న కాపు రామచంద్రారెడ్డి ఆ పదవి నుంచి తప్పుకుంటున్న పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డికి రాజీనామా లేఖను అందజేశారు. అధికారపార్టీలో నాయకుల మధ్య సమన్వయ సమస్యలు ఉన్నా అంత తారాస్థాయిలో ఏమీ లేవు. ఎవరి నియోజకవర్గ పరిధిలో వారు పనిచేసుకుంటూ వెళుతున్నారు. ఇటువంటి సమయంలో ఏ సమస్య వచ్చిందో తెలియదుకాని వైసిపి జిల్లా అధ్యక్ష పదవి నుంచి కాపు రాచంద్రారెడ్డి స్వచ్ఛందంగా తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. కుటుంబ సమస్యలతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు చెబుతున్నా ,ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న సందేహాలు రాజకీయవర్గాల్లో వెలువడుతున్నాయి. ఇక ఈ పదవిని ఎవరికి ఇస్తారన్న దానిపై వైసిపిలో చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే బి.గురునాథరెడ్డి, తలారి రంగయ్య, ఫయాజ్ బాషా తదితర పేర్లు ప్రముఖంగానే వినిపిస్తున్నాయి. అయితే అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది చూడాల్సి ఉంది. హిందూపురం పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్ మరో వివాదంలో పడ్డారు. ఇంటికి అద్దె చెల్లించకుండా ఉన్నారంటూ ఇంటి యాజమాని నిరసనకు దిగడం అధికారపార్టీలో మరో చర్చనీయాంశంగా మారింది. అశ్లీల విడియోల అంశం ఇటీవలనే సద్దుమణిగిన సమయంలో ఇది తెరపైకి రావడం రాజకీయవర్గాల్లో ఆయన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇక ప్రతిపక్ష టిడిపిలోనూ ఈ వారంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం అంశం తెరపైకి వచ్చింది. నియోజకవర్గం పరిధిలో మండల అధ్యక్షుల ఎంపిక సమావేశం జరిగింది. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో నేతలు బాహాబాహీకి దిగడం పెద్ద చర్చనీయాంశం అవుతోంది. 2019 నుంచి మొదలైన అధిపత్యపు పోరు రోజురోజుకు పెరుగుతూనే ఉంది. దీన్ని సమన్వయం చేయడం నాయకులకు సాధ్యపడని అంశంగా మారింది. ఇలా రాజకీయాల్లో ఎన్నికల వేడి మొదలైనట్టుగా కనిపిస్తోంది. ఇక ఈ వారంలో మరో ప్రధాన అంశం సోమందేపల్లి మండలంలోని కావేటినాగసముద్రంకు సంబంధించి ఒక రైతు సమస్య. రైతు పొలాన్ని నాసిన్ సంస్థకు బలవంతంగా తీసుకోవడం, ఆయన పొలాన్ని, నివాసాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ఉన్నఫలంగా వారినీ బజారుకీడ్చటం అనేక విమర్శలకు తావిస్తోంది. బాధితులకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం, యాదవ సంఘం నిరసనలో పాల్గొంటున్నారు. దీన్ని పోలీసుల చేత అణచివేసే చ్యలను అధికారులు చేపడుతున్నారు.

